నస్పూర్‌లో ఆర్‌టీవో సేవలు!

- తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుకు సింగరేణి క్వార్టర్ల కేటాయింపు
- కొనసాగుతున్న మరమ్మతులు
- ప్రస్తుతం వేంపల్లి అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయం


క్వార్టర్లలో కొనసాగుతున్న మరమ్మతులు

నస్పూర్: నస్పూర్ పట్టణంలో రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్యాలయం (ఆర్‌టీవో) ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణ పరిధిలోని సీసీసీలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండు క్వార్టర్లను ఆర్‌టీవో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుకు సింగరేణి యాజమాన్యం కేటాయించింది. వాటిలో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వేంపల్లిలోని అద్దె భవనంలో ఆర్‌టీవో కార్యాలయం కొనసాగుతుంది. కాగా సింగరేణి కేటాయించిన క్వార్టర్లలో మరమ్మతులు పూర్తి కాగానే ఆర్‌టీవో కార్యాలయ సేవలు ఇక్కడి నుంచే కొనసాగనున్నాయి.

నాలుగు ఎకరాల్లో శాశ్వత భవనం..

నస్పూర్ శివారులోని సర్వే నంబర్ 72లో సుమారు తొమ్మిది ఎకరాలను 2019లో ఆర్‌టీవో కార్యాలయం ఏర్పాటుకు కేటాయించారు. అందులో సుమారు 1.5 ఎకరంలో కేజీబీవీ విద్యాలయం ఏర్పాటు చేయగా, శ్రీరాంపూర్ –మందమర్రి జాతీయరహదారి బైపాస్ రోడ్డు ఏర్పాటుకు సుమారు 3.5 ఎకరాలు కోల్పోవాల్సి వచ్చింది. దీంతో మిగిలిన సుమారు నాలుగు ఎకరాలలో రూ.8 కోట్లతో ఆర్‌టీవో శాశ్వత భవన నిర్మాణం, ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు. సింగరేణి కేటాయించిన క్వార్టర్లలో మరమ్మతులు పూర్తి కాగానే రెండు నెలల్లోపు తాత్కాలిక కార్యాలయం ఏర్పాటు చేసి సేవలు అందించనున్నారు.

అన్ని ప్రాంతాల వారికి అనువైన స్థలం..

ఆర్‌టీవో కార్యాలయంలో వివిధ సేవలు పొందడానికి చెన్నూర్, బెల్లంపల్లి వైపు నుంచి వచ్చే వారు మంచిర్యాల సిటీ నుంచి వేంపల్లిలోని ఆర్‌టీవో కార్యాలయానికి వెళ్లడానికి ట్రాఫిక్‌తో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నస్పూర్‌లో ఆర్‌టీవో కార్యాలయానికి కేటాంచిన స్థలం జాతీయ రహదారి బైపాస్‌రోడ్డుకు ఆనుకుని ఉండడంతో బెల్లంపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట వైపు నుంచి వచ్చేవారు నేరుగా జాతీయ రహదారి నుంచి ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కార్యాలయానికి చేరుకోవచ్చు.

అనుమతులు రాగానే సేవలు ప్రారంభిస్తాం



నస్పూర్‌లోని సీసీసీలో సింగరేణి యాజమాన్యం తాత్కాలిక ఆర్‌టీవో కార్యాలయం ఏర్పాటుకు రెండు క్వార్టర్లు కేటాయించింది. వాటిలో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. పూర్తి కాగానే ఉన్నతాధికారుల అనుమతులు తీసుకుని సేవలు ప్రారంభిస్తాం. శాశ్వత భవన నిర్మాణానికి, ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం.

– టి. సంతోష్‌కుమార్, ఇన్‌చార్జి డీటీవో

‘అమృత్’ పనుల్లో జాప్యం

- తాగునీటి సరఫరాకు నిధులు విడుదల
- నత్తనడకన సాగుతున్న ట్యాంకుల నిర్మాణ పనులు
- పట్టణ ప్రజలకు తప్పని తిప్పలు


ఏడోవార్డులో నిలిచిపోయిన ట్యాంకు నిర్మాణ పనులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని లక్సెట్టిపేట, ఊత్కూరు, మోదెల, ఇటిక్యాల వార్డుల్లో నల్లాలు లేని ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం అమృత్ 2.0 అనే పథకాన్ని గత సంవత్సరం ప్రవేశపెట్టింది. నూతనంగా ఇళ్లు నిర్మించుకుని నల్లా కనెక్షన్ తీసుకోని వారి ఇళ్లకు తాగునీరు అందించేందుకు ఈ పథకం తీసుకొచ్చారు. ఇందుకు మున్సిపాలిటీ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక ప్రదేశంలో 12 లక్షల లీటర్లు, ఊత్కూరులోని ఏడో వార్డులో 6 లక్షల లీటర్లు, సత్యసాయినగర్‌లోని ఒకటవ వార్డులో 6 లక్షల లీటర్లతో మూడు వాటర్ ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం, 1200 నల్లా కనెక్షన్‌లు అమర్చేందుకు రూ.20 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పథకం అమలు బాధ్యతను ప్రజారోగ్య శాఖాధికారులకు అప్పగించారు. గత ఏడాది జూన్‌లో టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. కాగా ఏడోవార్డులో ట్యాంకు నిర్మాణ పనులు పిల్లర్ల దశలో నిలిచిపోగా పిల్లర్ల ఇనుము తుప్పు పడుతోంది. సత్యసాయినగర్ ఒకటవ వార్డులో పిల్లర్ల పనులు కొనసాగుతున్నాయి. 2026, జూన్ లోగా పనులు పూర్తి చేయాల్సి ఉంది. సంబంధిత అధికారులు పనులు వేగంగా పూర్తయ్యేట్లు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా పనులు

వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఇష్టారాజ్యంగా చేపడుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. పనులు నిర్వహించే ప్రదేశంలో ఎలాంటి సూచిక బోర్డులు, రక్షణ ఇనుప కంచెలు, సెక్యూరిటీ లేకుండా పనులు చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

గడువులోగా పూర్తి చేస్తాం

వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు ప్రారంభ య్యాయి. బిల్లుల సమస్యతో కొద్ది రోజులుగా పనులు నిలిచిపోయాయి. త్వరలోనే పనులు తిరిగి ప్రారంభిస్తాం. గడువు లోగా పనులు పూర్తి చేస్తాం.

– ఆశ్రిత్, మున్సిపల్ ఏఈ

క్లుప్తంగా

బస్సు వచ్చిందోచ్..!



జనగామ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సు

సాక్షి స్పందన

కోటపల్లి: ప్రాణహిత సరిహద్దు గ్రామాల వైపు బస్సు రాకపోవడంతో 12 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారని ఈనెల 22న ‘బస్సులు నడపండి.. బాధలు తీర్చండి’ శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితం కాగా ఆర్టీసీ అధికారులు స్పందించారు. పార్‌పల్లి మీదుగా లింగన్నపేట, ఎదులబంధం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్డినరీ బస్సుల సంఖ్య పెంచాలి

కోటపల్లి: పార్‌పల్లి మీదుగా కాళేశ్వరానికి ఆర్డినరీ బస్సుల సంఖ్యను పెంచి సమీప గ్రామాల్లో ఆపేలా చూడాలని బుధవారం రాంపూర్ కాంగ్రెస్ నాయకుడు బోడ్డు రవి మంచిర్యాల డీఎంకు వినతిపత్రం అందజేశారు. బస్సుల సంఖ్య పెంచి ఎర్రాయిపేట, బోరంపల్లి, కొల్లూర్, రాంపూర్, దేవులవాడ, లక్ష్మీపూర్ గ్రామాల్లో బస్సులు ఆపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దృష్టికి కూడా ఈ విషయం తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ప్రియసుగంధి


ప్రియసుగంధి

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా డాక్టర్ ప్రియ సుగంధిని నియమించారు. ఇక్కడ ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కోట శివకృష్ణ వరంగల్ వ్యవసాయ కళాశాలకు పదోన్నతిపై బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రియ సుగంధిని ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా నియమించారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

బెల్లంపల్లిరూరల్: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అందిస్తున్న పథకాలను, రుణాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఏఎల్ఈఏపీ ఇంక్యూబేషన్ మేనేజర్ నవీన్ కృష్ణ అన్నారు. మండలంలోని గురిజాల రైతువేదికలో స్వయం సహాయ సంఘాల మహిళలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీఎంలు శ్యామల, విజయలక్ష్మి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యామ్ సుందర్, సీసీలు సుందరేశ్, రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ శ్రద్ధగా చదువుకోవాలి

లక్సెట్టిపేట: విద్యార్థులు ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదువుకుని ఉన్నత హోదాలో ఉండాలని జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గుడ్‌షెప్పర్డ్ పాఠశాలకు చెందిన ఖుసీంద్ర వర్మ నీట్ ఫలితాలలో 1360 ర్యాంకుతో జిల్లాలో మొదటి స్థానం సాధించినందుకు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిలబస్‌తో పాటు పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావాలని పోటీ పరీక్షలతోనే ఉన్నత చదువులుంటాయన్నారు. అనంతరం విద్యార్థిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ స్టెబాస్టియన్, డైరెక్టర్లు ప్రవీణ్, గౌతమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి పైకప్పు

భీమిని: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం రాత్రి భీమిని మండల కేంద్రానికి చెందిన జొర్రిగల తిరుపతికి చెందిన ఇల్లు కూలి గోడలు, పెంకులు నేల మట్టమయ్యాయి. తిరుపతితో పాటు ఆయన భార్య, ఇద్దరు పిల్లలు పక్కన రెండో గదిలో నిద్రించడంతో పెను ప్రమాదం తప్పింది. అర్ధరాత్రి ఒక్కసారిగా పెద్దశబ్దం రావడంతో అందరూ లేచి బయటకు పరుగులు పెట్టారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఇంటర్, ఐటీఐ, పారామెడికల్ కోర్సు, ఏదైనా ఇంటర్‌తో సమాన అర్హత కలిగిన వారు చేరేందుకు అర్హులన్నారు. టెన్త్, ఇంటర్ మెమో, కుల, ఆధార్‌కార్డు, టీసీ సంబంధిత సర్టిఫికెట్‌లతో కళాశాలలో సంప్రదించాలన్నారు. వివరాలకు సెంటర్ కో ఆర్డినేటర్ నరేందర్‌రెడ్డిని సంప్రదించాలన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు చేసుకోవద్దు


జన్నారం: అవగాహన పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఎస్సై

జన్నారం: చదువుకునే వయస్సులో పిల్లలు మత్తుకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై గొల్లపెల్లి అనూష అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి, మద్యం వంటి వాటికి దూరంగా ఉండి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం శివరాజం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నెన్నెల: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎస్సై ప్రసాద్ సూచించారు. బుధవారం కుశ్నపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్, మత్తు పానీయాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. ఏఎస్సై శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై గోపతి సురేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర క్రిష్ణవేణి పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ప్రిన్సిపాల్ అనిల్, శిల్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

దండేపల్లి: విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై తహసీనొద్దీన్ సూచించారు. మండలంలోని లింగాపూర్ మోడల్‌స్కూల్‌లో దండేపల్లి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మికులకు బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎస్సై అంజనేయులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సంతకాల క్యాంపెయిన్ నిర్వహించి కార్మికులతో సంతకాలు చేయించారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తా

- కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి


ఆర్‌కేపీలో ఓపెన్‌జిమ్ ప్రారంభిస్తున్న మంత్రి వివేక్

రామకృష్ణాపూర్: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తానని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ బస్తీలో రూ.28లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైయినేజీ, ఓపెన్‌జిమ్‌లను బుధవారం మంత్రి ప్రారంభించారు. క్యాతనపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద నిర్మించిన మెట్లను కూడా ప్రారంభించారు. వివేక్ మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.10 కోట్లతో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపడుతుండగా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి క్యాతనపల్లికి మరో రూ.15 కోట్లు మంజూరు చేయించానన్నారు. అమృత్ స్కీం ద్వారా రూ.40 కోట్లతో ఇంటింటికీ నీటిని సరఫరా చేసేలా పనులు నడుస్తున్నాయని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటానన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, రఘునాథ్‌రెడ్డి, వొడ్నాల శ్రీనివాస్, జంగం కళ, గాండ్ల సమ్మయ్య, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వాహనం అడ్డగింత


పోలీసు వాహనాన్ని చుట్టుముట్టిన స్థానికులు

బెల్లంపల్లి: ఓ కేసు విషయంలో బస్తీవాసులు పోలీసు వాహనాన్ని అడ్డుకున్న ఘటన బుధవారం బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. ప్రత్యక్షసాక్షులు, బస్తీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ అంబేడ్కర్‌నగర్‌లో ఈనెల 22న ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. ఈ కేసు విషయంలో ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం పోలీసులు నిందితులను పోచమ్మ చెరువు వద్దకు తీసుకురాగా సమాచారం తెలిసిన బస్తీవాసులు భారీగా అక్కడికి చేరుకున్నారు. అప్పటికే రెండు పోలీసు వాహనాలు వెళ్లిపోగా ఉన్న వాహనాన్ని చుట్టుముట్టారు. అందులో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లతో వాగ్వాదానికి దిగారు. నిందితులను కోర్టులో హాజరుపర్చేందుకు పోలీసులు తప్పుడు రిపోర్టు సమర్పించారని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. పోచమ్మ చెరువు వద్దకు తీసుకొచ్చి నేరం అంగీకరించాలని తుపాకులతో బెదిరించినట్లు పేర్కొంటున్నారు. ఈ విషయమై వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్యను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఆకట్టుకున్న ఫుడ్ స్టాల్స్


ఫుడ్‌స్టాల్స్ ప్రారంభిస్తున్న కమిషనర్ రాజలింగు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపల్ ఆఫీస్ ముందు గల ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఎస్‌హెచ్‌జీ సభ్యులు బుధవారం ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్స్ ఆకట్టుకున్నాయి. స్టాల్స్‌ను మున్సిపల్ కమిషనర్ రాజలింగు, మెప్మా టీఎంసీ రఘురాంతో కలిసి ప్రారంభించారు. సభ్యులు తయారు చేసిన వివిధ రకాల తినుబండారాలను కమిషనర్ పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, మెప్మా ఆర్పీలు, సభ్యులు ఉన్నారు.

‘నాసిరకంగా మధ్యాహ్న భోజనం’

బెల్లంపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాసిరకంగా పెడుతున్నారని బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ ఆరోపించారు. బుధవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్‌వీ నాయకులు మురుకూరి శ్రావణ్, అరుణ్‌కుమార్, నితీష్, చాణక్య, రోషన్, సాయికిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో మండల విద్యానరుల కేంద్రంలో బుధవారం ఎంఈవో దత్తుమూర్తికి వినతిపత్రం అందించారు. ముస్తాఫా, భట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్, సీపెల్లి సాగర్ ఉన్నారు.

భగవద్గీత బహూకరణ

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో బుధవారం నిర్వహించిన ఎమర్జెన్సీ డే కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ రైల్వేస్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించి, భగవద్గీతను బహూకరించారు.

సంక్షిప్త వార్తలు

చెరువును కాపాడాలని వినతి

దండేపల్లి: మండల కేంద్రంలోని నల్లకుంట చెరువు కబ్జాకు గురవుతుందని, దానిపై అధికారులు దృష్టి సారించి కాపాడాలని నవ యువతరం యూత్ అధ్యక్షుడు గరిగె మురళి కోరారు. ఈమేరకు తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేకు బుధవారం వినతిపత్రం అందజేశారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టి పోయడం, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆరోపించారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

దండేపల్లి: జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. దండేపల్లిలో బుధవారం గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో ప్రసాద్‌కు సమ్మెనోటీసు అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పంచాయితీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజలింగు, లచ్చన్న, బాణయ్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

శివకృష్ణ సేవలు మరువలేనివి

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్, వ్యవసాయ శాస్త్రవేత్త కోట శివకృష్ణ రైతులకు అందించిన సేవలు మరువ లేనివని వక్తలు పేర్కొన్నారు. పదోన్నతితో వరంగల్ వ్యవసాయ కళాశాలకు బదిలీపై వెళ్తున్న శివకృష్ణకు బుధవారం కేవీకే ప్రాంగణంలో ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు తిరుపతి, స్రవంతి, ప్రియ సుగంధి, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వనమహోత్సవానికి గుంతలు సిద్ధం చేయాలి

చెన్నూర్‌రూరల్: జూలైలో నిర్వహించే వనమహోత్సవానికి గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచాలని మంచిర్యాల డీఆర్డీవో కిషన్ అన్నారు. చెన్నూర్‌లోని ఈజీఎస్ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈజీఎస్ ఏపీవో గంగాభవాని, ఈసీ చంద్రశేఖర్, టీఏలు రవి, మహేశ్వర్‌రెడ్డి, వెంకట్, రవీందర్, సీవోఎస్ సతీశ్, రాజేందర్, విజయ్ పాల్గొన్నారు.

వేమనపల్లి: వర్షాలు పడుతున్న నేపథ్యంలో మండలంలో వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలని ఎంపీడీవో కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్ పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో వీపీ సింగ్ జయంతి

జన్నారం: దివంగత మాజీ ప్రధాని వీపీ సింగ్ జయంతిని మండలకేంద్రంలో బుధవారం బీసీ సంఘాల అధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి జిల్లా కోకన్వీనర్ కడార్ల నరసయ్య, మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అశోక్, దాసరి తిరుపతి, గుడ్ల రాజన్న, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: మాజీ ప్రధాని, బీసీ రిజర్వేషన్ల ప్రదాత వీపీ సింగ్ జయంతిని జిల్లా కేంద్రంలో బుధవారం బీసీ జేఏసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వీపీ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఒడ్డెపల్లి మనోహర్, నాయకులు వెంకటయ్య, రాజన్న, కిరణ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

విద్యాశాఖలో ఖాళీలు భర్తీ చేయాలి

వేమనపల్లి: విద్యారంగంలో ఖాళీగా ఉన్న ఉప విద్యాధికారులు, డీఈవోలు, డైట్ కళాశాలల ఖాళీలు, ఎంఈవోల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి జయకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం డీటీఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ఈ నెల 27న జరిగే ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొనాలన్నారు. రాజశేఖర్, నారాయణ, రాజన్న, దివ్య, రమేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

లక్సెట్టిపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేకాధికారి అవినాష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సరోజ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఏపీవో వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి

కాసిపేట: వరంగల్‌లో ఈనెల 29న నిర్వహించే తెలంగాణ ప్రజాఫ్రంట్ నాలుగో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కో కన్వీనర్ బోగె పోశం, తుడుందెబ్బ అధ్యక్షుడు సండ్ర భూమయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో మహాసభ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో భాగంగా గద్దర్ నాయకత్వంలో ఉద్యమకారులంతా ఏకమై తెలంగాణ ప్రజాఫ్రంట్ స్థాపించారన్నారు. పార్లమెంటులో బిల్లు పెట్టే వరకు వివిధ ఉద్యమాలు చేశామని తెలిపారు. తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, భీంరావు, ముత్తు, వసంతరావు, రాజబాబు, సిడాం విజయ్, సురేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

వేమనపల్లి: మండలంలోని మామడ ప్రైమరీ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ఇన్ఫోర్సిస్ సంస్థ సహకారంతో మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ, మాజీ సర్పంచ్‌లు గాలి మధు, నాయకులు తిరుపతి, పూర్ణచంద్రారెడ్డి, తిరుపతిరెడ్డి, పురుషోత్తం, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

‘సింగరేణిలో ఉద్యోగం దొరకడం అదృష్టం’


నియామకపత్రాలు అందుకున్న వారితో మంత్రి

మందమర్రిరూరల్: సింగరేణిలో ఉద్యోగం లభించడం అదృష్టంగా భావించాలని రాష్ట్ర మైనింగ్, కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏరియా జీఎం దేవేందర్‌తో కలిసి హాజరై 14 మంది డిపెండెంట్లకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. మంత్రి మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన వారు విధులకు గైర్హాజరు కాకుండా సంస్థ ఉన్నతికి పాటుపడాలన్నారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ఎస్వోటూజీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, ఏరియా అధికారులు, యూనియన్‌ల ప్రతినిధులు ఉన్నారు. అనంతరం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో గజ్జెల లింగయ్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.

సీహెచ్‌పీ రైల్వే సైడింగ్ త్వరగా పూర్తి చేయాలి


వివరాలు తెలుసుకుంటున్న తిరుమలరావు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో నిర్మాణంలో ఉన్న కేకే -1 సీహెచ్‌పీ సైడింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేట్ జీఎం (సీహెచ్‌పీ) తిరుమలరావు అన్నారు. బుధవారం ఏరియాను జీఎం దేవేందర్‌తో కలిసి సందర్శించారు. పనులు జరుగుతున్న తీరును పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జీఎం ఆఫీస్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్వోటూజీఎం విజయ్‌ప్రసాద్, ఎస్ఈ(సివిల్) రాము, శ్రీధర్, డీవైఎస్ఈ బాలాజీ తదితరులు ఉన్నారు.

సింగరేణి అధికారుల సమస్యలు పరిష్కరించాలి


మంత్రిని సన్మానిస్తున్న అధికారులు

జైపూర్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సింగరేణి అధికారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి, సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ముందుగా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్, ఉద్యోగులు ఆయనను సన్మానించారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌పీ చెల్లించడంతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆయనను కోరారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి


రోగులతో మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

చెన్నూర్‌రూరల్: వర్షాకాలంలో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి డి.వెంకటేశ్వర్‌రావు సూచించారు. మండలంలోని పలు గ్రామాలను బుధవారం ఆయన సందర్శించి తనిఖీ చేశారు. అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసి శానిటేషన్ నిర్వహణ, రోగుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్నాద, బుద్దారం, ఎర్రగుంటపల్లి, సంకారం గ్రామాలను తనిఖీ చేశారు. ఎంపీవో అజ్మత్ అలీ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మంచిర్యాల : 9010299065, 9951602823

Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : విజయ్ ప్రకాంత్ - 9440208447
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నం.: 1800 425 9899